క్లుప్తంగా

మృతుడి కుటుంబానికి వైఎస్సార్ బీమా



నగదు అందజేస్తున్న దృశ్యం

పెద్దతిప్పసముద్రం : మండల కేంద్రంలోని కొలిమి వీధిలో కాపురం ఉండే బావన్న కుమారుడు వెంకటేష్ (38) జ్వరం కారణంగా గురువారం ఆకస్మికంగా మృతి చెందాడు. ఈ నేపథ్యంలో మృతుడి కుటుంబానికి వైఎస్సార్ బీమా రూ.లక్ష మంజూరు కాగా తక్షణ సాయంగా బాధిత కుటుంబానికి ఎంపీపీ మహమూద్, ఎంపీటీసీ చంద్రశేఖర్, సర్పంచ్ శంకర్, వైఎస్సార్‌సీపీ నాయకులు సాదిక్, సయ్యద్, మహబూబ్‌బాషా, సచివాలయ సిబ్బంది శుక్రవారం రూ.10 వేల నగదు అందజేశారు.

వైభవంగా గోపూజ



ఆలయంలో గోపూజ దృశ్యం

పెద్దతిప్పసముద్రం : స్థానిక శ్రీ ప్రసన్న పార్వతీ సమేత విరూపాక్షేశ్వర స్వామి ఆలయంలో శివాలయం సేవకులు సనగరం పట్టాభిరాయ్య ఆధ్వర్యంలో శుక్రవారం గోపూజ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. అధిక శ్రావణ మాసం సందర్భంగా వేద పండితులు రాముస్వామి అమ్మవారి ఉత్సవ విగ్రహానికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన కార్యక్రమాలను భక్తి శ్రద్ధలతో చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి పూజలు చేసి స్వామివారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

ఏబీవీపీ ఆధ్వర్యంలో కళాశాలల బంద్

కలికిరి : ఏబీవీపీ రాష్ట్రశాఖ పిలుపు మేరకు శుక్రవారం కలికిరిలో జూనియర్ కళాశాలల బంద్ నిర్వహించారు. అనుమతి లేని కళాశాలలు, విద్యార్థులు, తల్లిదండ్రుల వద్ద అధిక ఫీజులు వసూలు చేస్తున్న యాజమాన్యాలపై అధికారులు చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



వైద్య పరీక్షలు చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

కేవీపల్లె : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గర్నిమిట్ట పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శ్యామల అన్నారు. శుక్రవారం మండలంలోని గర్నిమిట్ట పంచాయతీ చింతమాకులపల్లెలో 104 వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. దోమలు పుట్టకుండా, కుట్టకుండా సరైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది రుక్మిణి, వెంకటరమణ, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

మండల సర్వేయర్‌గా నాగరాజు




కురబలకోట : మండల సర్వేయర్‌గా పి. నాగరాజును నియమిస్తూ అధికారులు శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. ఇక్కడున్న భువనేశ్వరి ఇటీవల సస్పెన్షన్ కు గురైన విషయం తెలిసిందే. ఆమె స్థానంలో రామసముద్రం సర్వేయర్‌గా పని చేస్తున్న నాగరాజుకు ఇన్‌చార్జిగా ఇక్కడ బాధ్యతలు అప్పగించారు.

సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసులో ఈ-స్టాంప్‌ల సౌకర్యం

తంబళ్లపల్లె : స్థానిక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రజలకు ఈ-స్టాంపుల సౌకర్యం ఏర్పాటు చేసినట్లు సబ్‌రిజిస్ట్రార్ వెంకటేశ్వర్లు తెలిపారు. విష్ణువర్ధన్ ఈ సెంటర్‌ను నిర్వహిస్తారన్నారు. ప్రజలకు అవసరమైన నాన్ జ్యుడీషియల్ స్టాంపులు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ సౌకర్యాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రకృతిని పరిరక్షించాలి



మాట్లాడుతున్న ప్రభుచరణ్

వాల్మీకిపురం : ప్రకృతిని పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని జనవిజ్ఞాన వేదిక అధ్యక్షుడు ప్రభుచరణ్ పేర్కొన్నారు.ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం సందర్భంగా జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతిని పరిరక్షించడం అంటే మనల్ని మనం రక్షించుకోవడమే కాక భావితరాలకు ఆరోగ్యకరమైన జీవితాలను ఇవ్వడం అన్నారు. ప్రకృతి లేకుంటే మానవ మనుగడే ప్రశ్నార్థకమవుతుందన్నారు. ప్రిన్సిపాల్ కల్పన, ఉపాధ్యాయులు రామలక్ష్మమ్మ, ఫరాహత్, కౌసర్, గిరిజారాణి, గౌతమి, సత్యమ్మ, చాముండేశ్వరి పాల్గొన్నారు.

సగర్వంగా నిలబడి

- నాడు-నేడుతో మారిన పాఠశాల ముఖచిత్రం
- ప్రత్యేక ఆకర్షణగా వివేకానంద మున్సిపల్ హైస్కూల్
- 'పది'లో సత్తా చాటిన విద్యార్థులు
- ట్రిపుల్ ఐటీకి 11 మంది ఎంపిక
- పెరిగిన అడ్మిషన్లు

కార్పొరేట్ స్కూళ్లను తలదన్నే విధంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు సత్తా చాటుతున్నారు. పేద కుటుంబాల విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసి వారిని ఉన్నత స్థాయికి చేర్చాలనే సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యాన్ని నెరవేరుస్తున్నారు. పదో తరగతి పరీక్షలతో పాటు పలు పోటీ పరీక్షల్లోనూ సత్తా చాటిన మదనపల్లె పట్టణం వివేకానంద మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు శభాష్ అనిపించుకుంటున్నారు. నాడు-నేడు పనులతో పాఠశాల రూపురేఖలు మారిపోయాయి. పది, పోటీపరీక్షల ఫలితాల్లో మంచి ఫలితాలు సాధిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తోంది.

మదనపల్లె సిటీ: మదనపల్లె మున్సిపాలిటీ పరిధిలోని వివేకానంద మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలతో విద్యార్థులు వరుస విజయాలతో దూసుకెళ్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సంవత్సరం పదో తరగతి పరీక్ష ఫలితాల్లో 550 మార్కులకుపైగా 13 మంది, 500 మార్కులకుపైగా 30 మంది సాధించి పాఠశాలకు మంచి పేరు తీసుకువచ్చారు. పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని హిమసాయి 584 మార్కులు సాధించి మొదటి స్థానంలో నిలిచింది. అంతే కాకుండా ట్రిపుల్ ఐటీకి మొదటి లిస్టులో 11 మందికి ఎంపికయ్యారు. ఇంకా మరికొందరు రెండవ జాబితాలో ఉన్నారు. నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్)కు 22 మంది అర్హత సాధించారు. దీంతో పాటు క్రీడల్లో సైతం విద్యార్థులు ప్రతిభ కనబరుస్తున్నారు.

పోటీ పరీక్షల్లో ప్రతిభ..

పాఠశాలకు చెందిన విద్యార్థులు గత ఏడాది ఎన్ఎంఎంఎస్‌కు 51 మంది ఎంపికయ్యారు. రాష్ట్రంలోనే ఒకే పాఠశాల నుంచి 51 మంది ఎంపికకావడం గమనార్హం. ట్రిపుల్ ఐటికి 18 మంది ఎంపికయ్యారు. పదిలో గత ఏడాది 550కిపైగా 13 మందికి, 500 కుపైగా 30 మంది విద్యార్థులకు వచ్చాయి . ప్రతి ఏడాది పాఠశాలలో మంచి ఫలితాలు వస్తున్నాయి.



ట్రిపుల్ ఐటికి ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

అడ్మిషన్లలో ముందంజ..

వివేకానంద మున్సిపల్ పాఠశాలలో ఈ ఏడాది అడ్మిషన్లు పెరిగాయి. ఈ ఏడాది ఇప్పటి వరకు 265 మంది కొత్తగా అడ్మిషన్లు పొందారు. ఈ పాఠశాలలో చేనేత కుటుంబాల పిల్లలు అధికంగా చదువుతున్నారు. ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు సైతం మున్సిపల్ పాఠశాలలో చేరుతున్నారు. ప్రస్తుతం పాఠశాలలో 1100 మంది విద్యను అభ్యసిస్తున్నారు.

నాడు-నేడుతో అదనపు గదుల నిర్మాణం

పాఠశాలలో నాడు-నాడు కింద పలు అభివృద్ధి పనులు చేశారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పాఠశాలకు 15 అదనపు గదులకు అనుమతి వచ్చింది. ఇందులో ప్రస్తుతం 9 తరగతి గదులు నిర్మాణ పనులు పూర్తికావచ్చాయి. ఇందుకోసం రూ.కోటి 8 లక్షలు కేటాయించారు. మరో ఆరు గదుల నిర్మాణం త్వరలో చేపట్టనున్నారు. సుశిక్షితులైన ఉపాధ్యాయులు, అందుబాటులో ఇంగ్లీషుమీడియం, రుచికరమైన జనగన్న గోరుముద్ద వెరసి పాఠశాల విద్యార్థులు ప్రతిభను కనబరిచారు. సర్కారు బడుల్లో చదివి సత్తా చాటిన విద్యార్థులను ఆయా పాఠశాలల ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు అభినందించారు.

పేద పిల్లల్లో ప్రతిభను వెలికితీయడమే జనగన్న లక్ష్యం



పేద పిల్లల్లో దాగి వున్న ప్రతిభను వెలికి తీయాలన్నదే సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి లక్ష్యం. అధికారంలోకి వచ్చిన వెంటనే నాడు-నేడు కింద ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చివేశారు. విద్యార్థులకు కావాల్సిన వసతులన్నీ సమకూర్చడంతో పాటు ఇంగ్లీషు మీడియం ప్రవేశపెట్టారు. వివేకానంద మున్సిపల్ పాఠశాల విద్యార్థులు అన్ని పోటీ పరీక్షలతో పాటు పదిలో మంచి ఫలితాలు సాధించి మున్సిపాలిటీకి మంచి పేరు తెస్తున్నారు.

– వి.మనూజారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్, మదనపల్లె

పిల్లల చదువుల పట్ల ప్రత్యేక శ్రద్ధ



పిల్లల చదువుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. ఇందుకు ఉపాధ్యాయులు అందరూ కలిసి కష్టపడి పని చేస్తున్నారు. పది విద్యార్థులపై మొదటి నుంచి ఫోకస్ చేస్తాం. వెనుబడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇస్తాం. పోటీ పరీక్షలకు ఉచిత కోచింగ్ ఇవ్వడంతో మంచి ఫలితాలు వస్తున్నాయి. పాఠశాలలో చాలా మంది పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన పిల్లలు ఉన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అనేక కార్యక్రమాలు విద్యాబోధనకు తోడ్పడుతున్నాయి. దీంతో మంచి ఫలితాలు వస్తున్నాయి.

– రాజేంద్రప్రసాద్, హెచ్ఎం, వివేకానంద మున్సిపల్ ఉన్నత పాఠశాల, మదనపల్లె

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

పీలేరు : పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం బాలంవారిపల్లె పంచాయతీ కురవపల్లె తదితర గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. ప్రతి ఇంటి వద్దకు వెళ్లి నాలుగేళ్ల పాలనలో ప్రభుత్వం ద్వారా పొందిన లబ్ధి చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలు అమలు చేయడం తోపాటు ఎన్నో సరికొత్త పథకాలు తీసుకొచ్చిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. రైతుల సంక్షేమానికి రైతులు, మహిళలు, విద్యార్థుల అభివృద్ధికి ప్రభుత్వ పథకాలు ఎంతగానో దోహదపడుతున్నాయని తెలిపారు. సంక్షేమ పథకాల క్యాలెండర్ ప్రకారం ప్రకటించిన తేదీన ముఖ్యమంత్రి బటన్ నొక్కితే నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు డబ్బులు జమ అవుతున్నాయని చెప్పారు. పేదవాడి కళ్లలో ఆనందం చూడాలని, ప్రతి కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందాలని పరితపించే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజల ఆశీర్వాదం ఉండాలని కోరారు. తాము నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటామని, ఏ సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకు రావాలని తక్షణ పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పింఛన్లు, హౌసింగ్‌లో ఇళ్లు మంజూరు చేయిస్తామన్నారు. గత ప్రభుత్వం ఎన్నికలకు ముందు హడావిడిగా ఒక రూపాయి ఖాతాలో జమ చేసి ఇళ్లు మంజూరంటూ జనాలను మోసం చేసిందని విమర్శించారు. అలాంటి బాధితులకు కూడా తమ ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేసిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ రత్నశేఖర్‌రెడ్డి, సర్పంచ్‌లు దండు జగన్‌మోహన్‌రెడ్డి, చంద్రారెడ్డి, వైస్ ఎంపీపీ ఎస్.వి. చలపతి, నాయకులు బి.డి. నారాయణరెడ్డి, బి.డి. మహేశ్వర్‌రెడ్డి, చిన్నయల్లప్ప, బెల్లి జయన్న, తిమ్మయ్య, కంభం భాస్కర్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, సుధాకర్‌రెడ్డి, ఆనంద్, చక్రధర్, అరుణ, శివగణేష్ సురేంద్ర, షాకీర్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

రాష్ట్రంలో సంక్షేమంతో ధర్మపాలన

ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

తంబళ్లపల్లె : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పార్టీలు, కుల, మతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తూ ధర్మపాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కోసువారిపల్లె పంచాయతీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా తిరుమలగుట్టపల్లె, తరుగువారిపల్లె, మాలపల్లె దళితవాడ, గట్టుమీదపల్లె, కోసువారిపల్లె కస్బాలో గడప గడపకు వెళ్లి ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. వాటిని పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో సుమారు రూ.10వేలకోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి రాష్ట్రంలోనే నియోజకవర్గం అభివృద్ధిలో మొదటి స్థానంలో నిలిచిందన్నారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ఆదరించి అత్యధిక మెజార్టీ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ విజయలక్ష్మీ రఘునాథ్, ఎంపీటీసీ సభ్యురాలు శ్యామలకోటిరెడ్డి, ఎంపీడీఓ సురేంద్రనాథ్, ఏఓ రమణకుమార్, ఏపీఓ అంజనప్ప, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్, నారాయణరెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ భార్గవ్‌రెడ్డి, నాయకులు శంకర్‌రెడ్డి, బావాజీ, కిషోర్‌రెడ్డి, ఖాదర్ బాషా, గంట్ల సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.



గడప గడపకు వెళ్లి సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు

- యూనియన్ బ్యాంకు మేనేజర్ లలితాంబ
- ముగిసిన క్లస్టర్ లెవల్ అథ్లెటిక్స్ మీట్

మదనపల్లె సిటీ : విద్యార్థులు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు సాధ్యపడుతుందని యూనియన్ బ్యాంకు మేనేజర్ లలితాంబ అన్నారు. శనివారం స్థానిక చిత్తూరు రోడ్డులోని జవహర్ నవోదయ విద్యాలయంలో క్లస్టర్ లెవల్ అథ్లెటిక్స్ మీట్-23 విజేతలకు ట్రోఫీలు, మెడల్స్, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ క్రీడల్లో పాల్గొనడం వల్ల క్రమశిక్షణ అలవడుతుందన్నారు. విద్యాలయ ప్రిన్సిపాల్ బి.గోవిందరావు మాట్లాడుతూ వచ్చే నెల 3న ప్రాంతీయ స్థాయి అథ్లెటిక్స్ మీట్ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పద్మావతి, వెంకటరమణ, పీడీలు పాల్గొన్నారు.

విజేతలు వీరే: క్లస్టర్ లెవెల్ అథ్లెటిక్స్ మీట్‌లో చిత్తూరు నవోదయ విద్యాలయ 211 పాయింట్లతో మొదటి స్థానంలో నిలిచింది. 74 పాయింట్లతో నెల్లూరు రెండవ స్థానం, 51 పాయింట్లతో కడప మూడవ స్థానంలో నిలిచింది. క్లస్టర్ లెవల్ సైన్స్ ఎగ్జిబిషన్‌లో హరీష్(కరేకల్) మొదటి స్థానం, శ్రీకర్ రెడ్డి(ప్రకాశం) రెండవ స్థానం, భరత్‌చంద్రారెడ్డి (కడప) మూడవ స్థానంలో నిలిచారు. విజేతలకు ప్రశంసాపత్రాలను అందజేశారు.



అథ్లెటిక్స్ మీట్‌లో ఓవరాల్ ఛాంపియన్‌షిప్ ట్రోఫీని అందుకుంటున్న చిత్తూరు క్రీడాకారులు

జిల్లా ఆస్పత్రికి బైపాప్ మెషిన్

మదనపల్లె : మదనపల్లె జిల్లా ఆస్పత్రిలో బైపాప్ మెషిన్ అందుబాటులోకి తెచ్చినట్లు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ పద్మాంజలిదేవి తెలిపారు. శుక్రవారం ఆస్పత్రిలో బైపాప్ మెషిన్ పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఊపిరి పీల్చుకునేందుకు ఇబ్బంది కలిగించే వైద్యపరిస్థితుల చికిత్సకు బైపాప్ మెషిన్ చక్కగా ఉపయోగపడుతుందన్నారు. జిల్లా ఆస్పత్రిలో రోగులకు అవసరమైన సమయంలో వినియోగిస్తామని తెలిపారు.

కనుల పండువగా పెద్దపీర్ల మెరవణి



కందుకూరులో పీర్లను ఊరేగిస్తున్న దృశ్యం

పెద్దతిప్పసముద్రం : మండలంలోని కందుకూరులో గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు జరిగిన పీర్ల ఊరేగింపును కనుల పండువగా నిర్వహించారు. మొహర్రం ఉత్సవాల్లో భాగంగా కందుకూరులో గత వారం రోజులుగా గ్రామ చావిడిలో కొలువైన పీర్లను పుర వీధుల్లో ఊరేగించారు. చుట్టు పక్కల మండల వాసులే కాకుండా కర్ణాటక రాష్ట్రం, దూర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి ఊరేగింపును తిలకించారు. భక్తులు ముడుపులు చెల్లించి ప్రత్యేక ప్రార్థనలు చేసారు. శనివారం జల్ది కార్యక్రమం జరుగుతుందని నిర్వాహకులు పేర్కొన్నారు.

కేవీపల్లెలో..

కేవీపల్లె : మండలంలోని గర్నిమిట్ట పంచాయతీ చింతమాకులపల్లెలో మొహరం ఉత్సవం ఘనంగా నిర్వహించారు. చింతమాకులపల్లెలో హిందువులు ఒక్క రోజు మొహరం పండుగ జరపడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా శుక్రవారం పీర్లను ప్రత్యేకంగా అలంకరించారు. మంగళ వాయిద్యాలు, డప్పులు, తదితర సాంస్కృతిక కార్యక్రమాలతో గ్రామంలో పీర్ల ఊరేగింపు చేపట్టారు. అనంతరం పీర్లతో అగ్నిగుండ ప్రవేశం చేశారు. రాజశేఖర్, రామకృష్ణ, రామ్మోహన్, వెంకటరమణ, రమేష్, పీరయ్య, మణి, రవీంద్ర, కుళ్లాయప్ప, రమణ, హరిబాబు, ఆదినారాయణ, సుబ్రమణ్యం, చాణక్య, అంజి తదితరులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో విద్యుత్ ఉద్యోగుల నిరసన

పీలేరు రూరల్ : తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రెండో రోజు శుక్రవారం స్థానిక విద్యుత్ కార్యాలయం ఎదుట భోజనం విరామం తరువాత విద్యుత్ ఉద్యోగులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జేఏసీ అధ్యక్షుడు దేవరాజు, కన్వీనర్ ప్రసాద్ మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. గ్రేడ్ -2 జేఎల్ఎంలను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని, అన్ లిమిటెడ్ మెడికల్ పాలసీ అమలు చేయాలన్నారు. చనిపోయిన గ్రేడ్-2 జేఎల్ఎంల కుటుంబాలకు వెంటనే ఉద్యోగం కల్పించాలని కోరారు ట్రాన్స్‌కో ఈఈ మునిచంద్ర, ఏడీ సుధాకర్, జేఈలు పాల్గొన్నారు.

ఏపీఎస్పీడీసీఎల్ కార్యాలయం ఎదుట..

మదనపల్లె : పట్టణంలోని ఏపీఎస్పీడీసీఎల్ కార్యాలయం ఎదుట ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం ఉద్యోగులు తమ కోర్కెల సాధన కోసం భోజన విరామ సమయంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ జాఫర్‌వలీ, జనరల్ సెక్రటరీ ఎస్.రాజశేఖర్‌రెడ్డి, కన్వీనర్ ఎస్.గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ పీఆర్సీని గతంలో మాదిరిగా ఇప్పటికే ఉన్న విధానాన్ని అనుసరించడంతో పాటు సింగిల్ మాస్టర్ స్కేలు వర్తింపజేయాలన్నారు. విద్యుత్ ఉద్యోగులకు జీపీఎఫ్, పాత పెన్షన్ విధానం వర్తింపజేయాలన్నారు. విధి నిర్వహణలో ప్రమాదానికి గురై మరణించినా లేదా శాశ్వత దుర్బలత్వం పొందిన ఎనర్జీ అసిస్టెంట్లపై ఆధారపడిన కుటుంబ సభ్యులకు శాశ్వత ఉద్యోగులవలే కారుణ్య నియామక పథకం వర్తింపజేయాలని కోరారు. రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల సంఘం నాయకులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న విద్యుత్ ఉద్యోగులు

కేశాలు దానం చేసిన చందనప్రియ

మదనపల్లె సిటీ : క్యాన్సర్ బాధితుల మోముల్లో చిరునవ్వు చిందించడానికి హెల్పింగ్‌మైండ్స్ తలపెట్టిన హెయిర్ డొనేషన్ కార్యక్రమానికి మంచి స్పందన లభిస్తోంది. ఇందులో భాగంగా శుక్రవారం మదనపల్లె పట్టణం నీరుగట్టువారిపల్లెకు చెందిన పెంచలయ్య, సరళ దంపతుల కుమార్తె చందనప్రియ హెల్పింగ్‌మైండ్స్ కార్యాలయానికి వచ్చి స్వచ్ఛందంగా తమ కేశాలను దానం చేశారు. నిర్వాహకురాలు అబూబకర్‌సిద్దిక్ వీరికి పూల మొక్కలను అందించి అభినందించారు. కార్యక్రమంలో హెల్పింగ్‌మైండ్స్ సభ్యులు చాను, అమీన్, కిరణ్ పాల్గొన్నారు.



మణిపూర్ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలి

వీసీకే పార్టీ ఆధ్వర్యంలో సబ్‌కలెక్టరేట్ ఎదుట నిరసన



సబ్ కలెక్టరేట్ ఎదుట మణిపూర్ దారుణాన్ని ఖండిస్తూ వీసీకే పార్టీ నిరసన

మదనపల్లె : మణిపూర్‌లో కొన్ని నెలలుగా మహిళలపై జరుగుతున్న అత్యాచారాలకు, మైనారిటీలపై జరుగుతున్న దాడులకు బాధ్యత వహిస్తూ కేంద్రప్రభుత్వం తక్షణమే అక్కడి ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేసి రాష్ట్రపతి పాలన విధించాలని విడుదలై చిరుతైగల్ కట్చి(వీసీకే)పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీటీఎం శివప్రసాద్ డిమాండ్ చేశారు. మణిపూర్‌లో మహిళల నగ్న ఊరేగింపుపై నిరసన వ్యక్తం చేస్తూ శుక్రవారం సబ్ కలెక్టరేట్ ఎదుట వీసీకే పార్టీ, భారతీయ అంబేద్కర్ సేన(బాస్) సంయుక్తంగా ఆందోళన చేపట్టాయి. ఈ సందర్భంగా శివప్రసాద్ మాట్లాడుతూ... మణిపూర్ కొండల్లో నిక్షిప్తమై ఉన్న విలువైన లోహాలు, ఖనిజాలు కార్పొరేట్ కంపెనీలకు అప్పగించేందుకే మణిపూర్‌లో మంటలు రాజేశారని చెప్పారు. నాన్ ట్రైబల్స్‌గా ఉన్న మైతేయి వర్గీయులను ఎస్టీ జాబితాలో చేర్చడం ద్వారా మణిపూర్ కొండల్లో మైనింగ్‌కు తలుపులు తెరవాలని అక్కడి ప్రభుత్వం కుట్ర చేసిందన్నారు. దీనికి వ్యతిరేకంగా కుకీ తెగల ప్రజలు ఆందోళన చేపట్టడంతో ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలు, సంఘ్‌పరివార్ మూకలకు కుకీల ఆందోళనలు అణచివేసే పని అప్పగించాయని పేర్కొన్నారు. మూడునెలలుగా సాగుతున్న నరమేధంలో ఇప్పటివరకు 240 మంది ప్రాణాలు కోల్పోగా, 400 మందికి పైగా తీవ్రగాయాలపాలయ్యారన్నారు. 270 గిరిజన గ్రామాలను బలవంతంగా ఖాళీచేయించారన్నారు. 60వేల మంది శరణార్థులుగా ఉన్నారన్నారు. మహిళల నగ్న ఊరేగింపులు, అత్యాచారాలు, హత్యలు, గృహదహనాలు నిత్యకృత్యమైపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ర్యాలీగా వెళ్లి సబ్ కలెక్టరేట్ డీఏఓకు వినతిపత్రం అందజేశారు. వీసీకే పార్టీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి ముత్యాల మోహన్, బాస్ కేంద్రకమిటీ ప్రతినిధులు పోతబోలు రెడ్డెప్ప, బురుజు లక్ష్మీనారాయణ, గిన్నెల మనోహర్‌రెడ్డి, రాయల్ సూర్య, సొన్నికంటి రెడ్డెప్ప, మంచూరి మారెప్ప, ఉత్తన్న, జి.వి.రమణ, సాంబ, శశికుమార్, క్రాంతి, తెట్టు శ్రీనివాసులు, జనార్దన్ పాల్గొన్నారు.

మణిపూర్‌లో శాంతి నెలకొల్పాలి

వాల్మీకిపురం : మూడు నెలలుగా మారణకాండతో మండిపోతున్న మణిపూర్‌లో శాంతిని ప్రసాదించు అల్లాహ్ అంటూ వాల్మీకిపురంలోని జామియా మసీదు వద్ద శుక్రవారం ముస్లింలు సామూహిక ప్రార్థనలు చేశారు. జుమా నమాజ్ అనంతరం ముస్లింలు మసీదు వెలుపల నిలబడి మణిపూర్‌లో నెలకొన్న అశాంతి పట్ల విచారం వ్యక్తం చేశారు. మాటలలో కూడా చెప్పలేని విధంగా అక్కడి మహిళలపై జరిగిన దాష్టీకాలు, క్రౌర్య చర్యలు మానవత్వాన్ని మంటగలిపాయని, రెండు జాతుల మధ్య నెలకొన్న గొడవలు సమాజంలో మారణకాండను ప్రేరేపించడం శోచనీయమని పేర్కొన్నారు. మే 4న ఇద్దరు మహిళలను దిగంబరం చేసి తరిమికొట్టడం, అడ్డుకోబోయిన కుటుంబ సభ్యులను పాశవికంగా హతమార్చడం యావత్తు సమాజం తలదించుకోవాల్సిన సంఘటన అన్నారు. ఇంతటి దారుణ పరిస్థితులు నెలకొన్నా ప్రభుత్వ పెద్దలు మౌనం వహించడం సరికాదన్నారు. రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్, జవాద్ హుస్సేన్, మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

ములకలచెరువులో..

ములకలచెరువు : మణిపూర్ ఘటనపై కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించి ప్రధాన మంత్రి నరేంద్రమోదీ రాజీనామా చేయాలని బహుజన సమాజ్ పార్టీ, సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక మండల కేంద్రంలో వారు నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ, సీపీఐ నాయకులు ప్రసాద్, అంజప్ప తదితరులు ఉన్నారు.

31న తిరువణ్ణామలైకు ప్రత్యేక బస్సులు

మదనపల్లె సిటీ : ఈనెల 31న పౌర్ణమిని పురస్కరించుకుని తిరువణ్ణామలైకి ప్రత్యేక ఆర్టీసీ బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ-2 డిపో మేనేజర్ ఆర్‌సీ నిరంజన్ తెలిపారు. ఇందుకోసం ఆరు అల్ట్రా డీలక్స్ బస్సులు తిరుగుతాయని తెలిపారు. మరిన్ని వివరాలకు 9959225677, 9160186645, 9000935897ను సంప్రదించాలని కోరారు.

గురుకులాల్లో మిగులు సీట్లను సద్వినియోగం చేసుకోండి

కేవీపల్లె : ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని వివిధ బాలికల గురుకుల పాఠశాలల్లో మిగిలి ఉన్న సీట్లను విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ గురుకుల పాఠశాలల జిల్లా కన్వీనర్ జె. సురేష్ తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పీలేరు, కలకడ, గుర్రంకొండ, చిత్తూరు, వాల్మీకిపురం బాలికల గురుకుల పాఠశాలల్లో సీట్లు మిగిలి ఉన్నాయన్నారు.

దోమల వ్యాప్తిని అరికట్టండి

ములకలచెరువు : దోమల వ్యాప్తిని అరికట్టేందుకు ప్రజలు తగిన చర్యలు తీసుకోవాలని పీహెచ్‌సీ సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు సూచించారు. శుక్రవారం డ్రై డే సందర్భంగా పెద్దపాళ్యంలో వైద్య సిబ్బందితో కలిసి పర్యటించారు. దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

చౌకబియ్యం పంపిణీలో అక్రమాలకు పాల్పడితే కేసులు

కలకడ : మండలంలోని ప్రతి కార్డుదారునికి ప్రభుత్వం అందించే ఉచిత బియ్యం, నిత్యావసర సరుకుల పంపిణీలో డీలర్లు లేదా యండీయూ ఆపరేటర్లు అక్రమాలకు పాల్పడితే కేసులు తప్పవని తహసీల్దార్ ప్రదీప్ హెచ్చరించారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సీఎస్‌డీటీ వెంకటరెడ్డి ఏర్పాటు చేసిన యండీయూ ఆపరేటర్లు, ప్రభుత్వ చౌకదుకాణ డీలర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంపీపీ శ్రీదేవి మాట్లాడుతూ కార్డుదారులందరికీ నిత్యావసర సరుకులు అందించాలని కోరారు. డీలర్ల సంఘం అధ్యక్షుడు సురేంద్ర పాల్గొన్నారు.

దివ్యాంగుల చట్టాలపై అవగాహన అవసరం

మదనపల్లె సిటీ : దివ్యాంగుల చట్టాల గురించి తెలుసుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని జిల్లా వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కృష్ణకిషోర్ అన్నారు. శుక్రవారం స్థానిక గొల్లపల్లి వద్ద ఉన్న ఓ ఫంక్షన్ హాలులో వెలుగు దివ్యాంగుల పాఠశాల, జిల్లా దివ్యాంగులు, వయోవృద్ధులు, సంక్షేమశాఖ సంయుక్త ఆధ్వర్యంలో దివ్యాంగుల హక్కుల చట్టం-2016పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డీవైఈఓ కృష్ణప్ప, ఎంఈఓ ప్రభాకర్‌రెడ్డి, సీడీపీఓ సుజాత, వెలుగు కార్యదర్శి ఉదయమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

సంఘమిత్రలకు మొబైల్ ఫోన్లు ఇవ్వాలి

తంబళ్లపల్లె : వైఎస్సార్ క్రాంతిపథం మహిళా సంఘాల అభివృద్ధికి కృషి చేస్తున్న సంఘమిత్రలకు 5-జీ సామర్థ్యం గల సిమ్‌కార్డుతో మొబైల్‌ఫోన్లు ప్రభుత్వమే పంపిణీ చేయాలని సంఘమిత్రలు కోరారు. ఈ మేరకు ఏపీఎం గంగాధర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ వద్ద ఉన్న సెల్‌ఫోన్లలో నెట్‌వర్క్, సర్వర్ పనిచేయకపోవడంతో సమస్య ఏర్పడుతోందన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సంఘమిత్రల సంఘం అధ్యక్షుడు శివశంకర్‌రెడ్డి, రాజేశ్వరి, వనిత, నాగరాజు, లక్ష్మన్న, చాన్‌బాషా, హేమావతి, నాగమణి, రేణుక తదితరులు ఉన్నారు.

కుష్టువ్యాధి నివారణకు ఉచిత మందులు

కలకడ : కుష్టువ్యాధి నివారణకు ప్రభుత్వం ఉచితంగా మందులు పంపిణీ చేస్తుందని జిల్లా పారా మెడికల్ అధికారి గుర్రప్ప తెలిపారు. శుక్రవారం మండలంలోని కలకడ, ఎర్రకోటపల్లె పీహెచ్‌సీ పరిధిలో గత నెల 26వతేదీ నుంచి ఈనెల 25వతేదీ వరకు నిర్వహించిన ఇంటింటి సర్వేలో ఎర్రకోటపల్లె పీహెచ్‌సీ పరిధిలో ఒక వ్యక్తికి కుష్టువ్యాధి లక్షణాలు ఉన్నట్లు నిర్ధారించారు. కలకడ, ఎర్రకోటపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ మల్లికార్జున, కిషోర్‌కుమార్‌రెడ్డి, జవహర్‌బాబు, ఎంపీహెచ్‌ఈఓలు జయరామయ్య, వెంకటేష్ పాల్గొన్నారు.